నమస్తే తెలంగాణ
వికారాబాద్
I | హైదరాబాద్, శుక్రవారం 31 జనవరి 2025 | VIKARABAD

1912కు కాల్ చేయండి

సిటీబ్యూరో, జనవరి 30 (నమస్తే తెలంగాణ): వినియోగదారులకు మరింత మెరుగైన సేవలందించే ఉద్దేశంతో గ్రేటర్ హైదరాబాద్ నగరానికే పరిమితమైన టోల్ ఫ్రీ నంబర్ 1912ను గ్రామీణ ప్రాంతాలకు కూడా విస్తరిస్తున్నామని టీజీఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం గానీ, ఏదైనా విద్యుత్ అత్యవసర పరిస్థితి కానీ ఎదురైనప్పుడు ఈ నంబర్‌ను సంప్రదించాలని వినియోగదారులకు ఆయన సూచించారు. మునుపెన్నడూ లేనంతగా ఈ జనవరి నెలలో దక్షిణ డిస్కంలో విద్యుత్ డిమాండ్ 9500 మెగావాట్లకు చేరిందని, ఒక్క గ్రేటర్‌లోనే 4800 మెగావాట్లకు చేరడంతో అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. వేసవిలో ఈ డిమాండ్ విపరీతంగా పెరిగే అవకాశం ఉన్నందున ముందస్తు ప్రణాళికతో పనులు చేపట్టామని, సిబ్బంది కూడా వినియోగదారుల సమస్యలపై సకాలంలో స్పందించి వాటికి పరిష్కారం చూపాలని ముషారఫ్ ఫరూఖీ తెలిపారు.

మండల కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

కాసుల కక్కుర్తి..

బరితెగిస్తున్న రెవెన్యూ అధికారులు

- పట్టాదారులకు తెలియకుండానే రూ. కోట్ల విలువైన భూములు అక్రమార్కుల పరం
- పూడూరు మండలం, చన్గోముల్‌లోని 10 ఎకరాల 22 గుంటల భూమిని ఇతరుల పేరిట రిజిస్ట్రేషన్ చేసిన డిప్యూటీ తహసీల్దార్
- విచారణ చేసి నివేదికను కలెక్టర్‌కు అందజేసిన అధికారులు
- పూడూరు డీటీపై ప్రతీక్ జైన్ వేటు
- మోమిన్‌పేట మండల కేంద్రంలోనూ ఎకరంన్నర భూమి..

జిల్లాలో పలువురు రెవెన్యూ అధికారులు బరితెగిస్తున్నారు. పలు మండలాల రెవెన్యూ కార్యాలయాలు అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారిపోతున్నాయి. రూ. కోట్ల విలువైన భూములను గుట్టుచప్పుడు కాకుండా ఇతరుల పేరిట మార్చుతూ అక్రమాలకు పాల్పడుతున్నారు. మూడు తరాల నుంచి కబ్జాలో ఉండి సాగు చేసుకుంటున్న భూములపై అక్రమార్కులు గద్దల్లా వాలిపోతున్నారు. కొందరు రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై బోగస్ డాక్యుమెంట్లు, మ్యుటేషన్లు, సక్సేషన్లు, జీపీఏలు చేసుకుంటూ నిజమైన రైతులను ఆగం చేస్తున్నారు. భూ కబ్జాదారులు రెవెన్యూ అధికారులతో కలిసి ధరణి పోర్టల్‌లో పట్టాదారు పేర్లు మార్చుతూ.. కబ్జా కోసం కోర్టుకెక్తూ.. బాధితులను ముప్పతిప్పలు పెడుతున్నారు. జిల్లాలో ఇటీవల పూడూరు, మోమిన్‌పేట మండలాల్లో జీపీఏలకు సంబంధించి పట్టాదారులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే ఇతరుల పేరిట భూమార్పిడి చేయగా.. ఈ విషయం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. ఈ వ్యవహారంపై జిల్లా ఉన్నతాధికారులు విచారణ చేపట్టగా.. సంబంధిత పూడూరు డీటీపై కలెక్టర్ ప్రతీక్ జైన్ వేటు వేశారు .

-వికారాబాద్, జనవరి 30 (నమస్తే తెలంగాణ)

జిల్లాలోని పూడూరు మండలంలో రూ. పది కోట్ల విలువైన భూమిని కాజేసేందుకు అక్రమార్కులు రెవెన్యూ అధికారితో కుమ్మక్కయ్యారు. గుట్టుచప్పుడు కాకుండా రైతులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా థర్డ్ పార్టీకి జీపీఏ అప్రూవల్ చేసి 10 ఎకరాల 22 గుంటల భూమిని డిప్యూటీ తహసీల్దార్ ఇతరుల పేరిట మార్చేశాడు. ఈ వ్యవహారంపై జిల్లాలో జోరుగా చర్చ జరుగుతున్నది. పూడూరు మండలంలోని చన్గోముల్ రెవెన్యూ పరిధిలోని సర్వేనంబర్ 496 లోని 10 ఎకరాల 22 గుంటల భూమి గఫార్‌ఖాన్, ఇమ్రాన్‌ఖాన్, ఇస్మాయిల్, మల్గ అంజయ్య, మల్గ బుచ్చమ్మ, మల్గ మల్లేశం పేరిట రికార్డుల్లో ఉండడంతోపాటు కబ్జాలోనూ వారున్నారు. అయితే వారందరూ 2009లో విఠల్‌గౌడ్, మహ్మద్ బాసిత్, శ్యామ్, సీఎల్ఎన్ ప్రసాద్ పేరిట జీపీఏ చేశారు. అయితే ఈ నెల 4, 6, 7 తేదీల్లో జీపీఏ చేసుకున్న పై నలుగురు వ్యక్తులు పట్టాదారులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా గగన్‌రెడ్డి పేరిట 10 ఎకరాల 22 గుంటల భూమిని జీపీఏ అప్రూవల్ చేయగా డిప్యూటీ తహసీల్దార్ రిజిస్ట్రేషన్ చేశాడు. కాగా ఈ నెల 10న రుణం తీసుకునేందుకు బ్యాంకుకెళ్లిన బాధిత రైతుకు ఆన్‌లైన్‌లో గగన్‌రెడ్డి పేరు కనిపించడంతో ఖంగుతిన్నాడు. ఈ విషయం మిగతా రైతులకు తెలిపి తహసీల్దార్ కార్యాలయానికెళ్లి ఆరా తీయగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది. తిరిగి సంబంధిత రైతుల పేరిట 10 ఎకరాల 22 గుంటల భూమిని రిజిస్ట్రేషన్ చేసి అధికారులు వివాదాన్ని సద్దుమణిగేలా చేశారు. కాగా భూమి తన పేరిట నుంచి తిరిగి రైతుల పేరిట రిజిస్ట్రేషన్ కావడంతో గగన్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తమ భూమిని కాజేసేందుకు ప్లాన్ చేయడంతోపాటు తమపైనే పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పట్టాదారులు కలెక్టర్‌తోపాటు ఎస్పీ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లారు.

తహసీల్దార్ సెలవులో ఉండడంతో ఇన్‌చార్జి తహసీల్దార్‌గా ఉన్న డిప్యూటీ తహసీల్దార్ పెద్ద ఎత్తున డబ్బులు తీసుకొని ఈ అక్రమాలకు పాల్పడినట్లు రెవెన్యూ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతున్నది. మరోవైపు మోమిన్‌పేట మండల కేంద్రంలోనూ ఇలాంటి అక్రమ రిజిస్ట్రేషనే జరిగింది. పట్టాదారులకు తెలియకుండానే ఎకరంన్నర భూమిని గతంలో జీపీఏ చేసుకున్న వ్యక్తి పేరిట మోమిన్‌పేట తహసీల్దార్ అప్రూవల్ చేశాడు. ఈ విషయం తెలుసుకున్న బాధిత రైతు ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. అయితే ఈ అక్రమ భూ రిజిస్ట్రేషన్ వ్యవహారంపై అసిస్టెంట్ కలెక్టర్ విచారణ చేపట్టారు.

పూడూరు డిప్యూటీ తహసీల్దార్‌పై వేటు

పూడూరు : రైతులకు తెలియకుండా ఇతరుల పేరిట భూమిని రిజిస్ట్రేషన్ చేసిన పూడూరు డిప్యూటీ తహసీల్దార్ కిశోర్‌ను తక్షణమే సస్పెండ్ చేస్తున్నట్లు వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చన్గోముల్ గ్రామంలోని సర్వేనంబర్ 496లో ఉన్న పది ఎకరాల 22 గుంటల భూమిని గత నెల మొదటి వారంలో గగన్‌రెడ్డి పేరిట డిప్యూటీ తహసీల్దార్ బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఈ విషయంపై బాధితులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతోపాటు గురువారం పలు దినపత్రికల్లో ఈ భూకబ్జాపై కథనాలు వచ్చాయి. దీంతో స్పందించిన కలెక్టర్ ప్రతీక్ జైన్ అక్రమ రిజిస్ట్రేషన్‌కు పాల్పడిన పూడూరు డిప్యూటీ తహసీల్దార్‌ను తక్షణమే విధుల నుంచి తొలగిస్తూ గురువారం సాయంత్రం పూడూరు తహసీల్దార్‌కు ఉత్తర్వులు జారీ చేశారు.

రైతులకు ధోకా..

- ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని తలకొండపల్లి మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకుల ఆందోళన
- తలకొండపల్లి-షాద్‌నగర్ రోడ్డుపై సీఎం దిష్టిబొమ్మ దహనం

కడ్తాల్, జనవరి 30 : అన్నదాతలను కాంగ్రెస్ సర్కార్ అన్ని విధాలా మోసం చేస్తున్నదని బీఆర్ఎస్ నాయకులు మండిపడ్డారు. రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ గురువారం తలకొండపల్లి మండల కేంద్రంలో వారు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా తలకొండపల్లి-షాద్‌నగర్ రహదారిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ..కాంగ్రెస్ పార్టీ మాయ మాటలు, అలవి కాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చి రైతులను దగా చేస్తున్నదని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో అధికారంలోకి రాగానే పెట్టుబడి సాయాన్ని రూ.15 వేలు ఇస్తామని చెప్పి.. దానిని రూ.12 వేలకు కుదించిందన్నారు. ఈ సర్కార్ హామీల అమల్లో పూర్తిగా విఫలమైందని.. అన్ని వర్గాలనూ మోసం చేస్తున్నదన్నారు. తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన రైతుబంధు పథకాన్ని ప్రస్తుత ప్రభుత్వం తుంగలోకి తొక్కిందన్నారు. రాష్ట్రంలోని ఏ గ్రామంలోనూ పూర్తి స్థాయిలో పంట రుణాల మాఫీ కాలేదన్నారు. ఆందోళనలో మాజీ జడ్పీటీసీ నర్సింహముదిరాజ్, బీఆర్ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్‌రెడ్డి, యూత్ ప్రెసిడెంట్ శ్రీశైలంయాదవ్, పీఏసీఎస్ డైరెక్టర్లు శేఖర్‌యాదవ్, యాదయ్య, పాండుయాదవ్, మోహన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, పాండు, కృష్ణ, నర్సింహ, మల్లేశ్, గణేశ్, లక్ష్మీకాంత్, శంకర్‌నాయక్, వెంకటాచారి, ప్రవీణ్, చెన్నయ్య, సాలయ్య, బాబయ్య, బాలరాజు, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

సీపీఆర్‌తో పునర్జీవనం

కార్డియాక్ అరెస్ట్ బాధితులకు సీపీఆర్‌తో పునర్జీవం ప్రసాదించొచ్చని నగర సీపీ ఆనంద్ అన్నారు. గురువారం బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంట్రల్‌లో ఏర్పాటు చేసిన నాలుగు రోజుల సీపీఆర్ శిక్షణా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్డియాక్ అరెస్ట్‌కు గురైన వారికి అత్యవసర పరిస్థితుల్లో సీపీఆర్ చాలా కీలకమని, దీనిని దృష్టిలో పెట్టుకుని నగర పోలీసులకు సీపీఆర్‌పై శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే మొదటి దశలో 1409మందికి శిక్షణ ఇచ్చామని, నేటి నుంచి 2వ దశలో మరో 1248 మంది పోలీసు అధికారులు, సిబ్బందికి శిక్షణ ఇస్తామన్నారు. కార్యక్రమంలో పోలీస్ అధికారులు, వైద్యులు పాల్గొన్నారు.

-సిటీబ్యూరో, జనవరి 30 (నమస్తే తెలంగాణ)

అపార్ నమోదులో గందరగోళం

సిటీబ్యూరో, జనవరి 30 (నమస్తే తెలంగాణ) : ఒకే దేశం ఒకే ఐడీలో భాగంగా ప్రతి విద్యార్థికీ అపార్ (ఆటోమేటెడ్ పర్మనెంట్ అకాడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) ఐడీ నమోదు చేసే ప్రక్రియను విద్యాశాఖ వేగవంతం చేసేందుకు సిద్ధమైనది. అయితే అపార్ ఐడీ నమోదుకు క్షేత్రస్థాయిలో అనేక సమస్యలు ఎదురవుతున్నాయని టీచర్లు చెబుతున్నారు. విద్యార్థుల పేర్లు ఆధార్‌లో ఒకలా.. స్కూల్ రిజిస్టర్‌లో మరో విధంగా ఉండడంతో ఆ పేర్లను ఎలా ఎంటర్ చేయాలనే దానిపై గందరగోళ పరిస్థితులు ఉత్పన్నమయ్యాయి. ఇందుకోసం విద్యార్థి పేరు ఏ విధంగా ఎంటర్ చెయ్యాలో చెప్పాలని కోరుతూ తల్లిదండ్రుల నుంచి అంగీకార పత్రాలను కోరుతున్నారు. దీంతోపాటు ఆ పేరుకు సంబంధించిన గుర్తింపు కార్డును కూడా జత చేయాలని పాఠశాలల నిర్వాహకులు చెప్పడంతో తల్లిదండ్రులు ఆధార్ కార్డులో పేరు మార్పుల కోసం సమయం పడుతుందని సమాధానమిస్తున్నారు. ఈ క్రమంలో అపార్ నమోద ప్రక్రియకు గడువు పొడిగించాలని స్కూళ్ల నిర్వాహకులు విద్యాశాఖను కోరారు. ఇటీవల జనవరి 31 వరకు హైదరాబాద్‌లో అపార్ ఐడీ నమోదుకు తుది గడువుగా పెట్టారు. కానీ ఇప్పుడు ఆ సమయాన్ని మరింత పొడిగించాలనే డిమాండ్‌లు పెరిగాయి.

డ్రైవింగ్ లైసెన్స్‌ల రద్దు వేగవంతం

గతేడాది రాష్ట్రవ్యాప్తంగా 16,904

ప్రస్తుతం 2,412 లైసెన్స్‌లు ఆర్టీఏ పరిశీలనలో..

'మద్యం మత్తులో డ్రైవింగ్‌పై నియంత్రణ కోల్పోయి ఇతరుల ప్రాణాలను బలి తీసుకుంటున్నారు. కేసు నమోదుతోపాటు డ్రైవర్ల లైసెన్స్‌లు రద్దు చేసేందుకు అధికార యంత్రాంగం పరిశీలిస్తున్నది. ప్రస్తుతం ఆర్టీఏ అధికారుల ముందు 2,412 లైసెన్సుల రద్దు పరిశీలనకు ఉండడం విశేషం. ఇందులో మందుబాబులే అధికంగా రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్నారని అధికారులు పేర్కొంటున్నారు. గతేడాది రాష్ట్రవ్యాప్తంగా 16,904 లైసెన్స్‌లు రద్దయ్యాయి.'

సుక్కేసి చక్రం తిప్పితే.. అంతే..

సిటీబ్యూరో : వాహనదారుల నిర్లక్ష్యంపై ఆర్టీఏ అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. నిబంధనలు అతిక్రమించే వారిపై డ్రైవింగ్ లైసెన్స్ రద్దును ప్రయోగిస్తున్నారు. మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై, ట్రాఫిక్, రవాణా నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠినంగా వ్యవహరిస్తున్నారు. తొలుత జరిమానాలతో సరిపెడుతూనే, పదేపదే నిబంధనలు ఉల్లంఘించే వారి డ్రైవింగ్ లైసెన్స్‌లనూ రద్దు చేస్తున్నారు. ట్రాఫిక్ పోలీసుల నుంచి వచ్చే లైసెన్సుల రద్దు ప్రక్రియను వేగవంతం చేసి ఉల్లంఘనులను బెంబేలెత్తిస్తున్నారు. లైసెన్స్‌ను సస్పెండ్ చేసేందుకు కేసులను రెండు కేటగిరీలుగా విభజించారు. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించిన కేసులను మొదటి కేటగిరీగా, నిర్లక్ష్యపు డ్రైవింగ్‌తో ప్రమాదాలు చోటు చేసుకుంటున్న వాటిని రెండో కేటగిరీగా వర్గీకరించి కేసులు నమోదు చేస్తున్నారు. వీటితోపాటు రోడ్డు ప్రమాదాల నివారణపై శాశ్వతంగా డ్రైవింగ్ లైసెన్స్‌లు రద్దు చేసే ప్రక్రియపైనా కసరత్తు చేస్తున్నారు. కారు నంబర్‌పై స్పీడ్ లేజర్ గన్ చిత్రీకరించిన దృశ్యాలను చూస్తూ పలుమార్లు అతివేగంతో ప్రయాణించడాన్ని ట్రాఫిక్ పోలీసులు గుర్తించి, లైసెన్స్ సస్పెండ్ చేయాలని రవాణా శాఖకు పంపుతున్నారు. అంతేకాదు, లైసెన్స్ రద్దులో ఉన్నప్పుడు వాహనం నడుపుతూ దొరికితే జైలు శిక్ష కూడా పడే వీలుంది. రోడ్డు ప్రమాదాలు జరుగకుండా వాహనదారుల్లో క్రమశిక్షణ పెంపొందించే కార్యక్రమాలు సైతం ఆర్టీఏ అధికారులు నిర్వహిస్తున్నారు.

రద్దు ప్రక్రియ ఇలా.

పోలీసుల నుంచి ఉల్లంఘనుల వివరాలు రవాణాశాఖకు చేరుతాయి. వారు పరిశీలించి సదరు వ్యక్తికి నోటీసులు పంపిస్తారు. పది రోజుల్లో అతడు తన వివరణను ఆర్టీఏ అధికారులకు ఇవ్వాల్సి ఉంటుంది. అనంతరం, రవాణాశాఖ అధికారుల నిర్ణయం మేరకు లైసెన్స్ రద్దు ప్రక్రియ జరుగుతుంది. కోర్టు నిబంధనల ప్రకారం, లైసెన్స్ రద్దు ప్రక్రియ ఉంటుంది.

మహాత్మా.. సర్కారు కండ్లు తెరిపించు

- ఇచ్చిన హామీల్లో కొన్నింటినైనా అమలు చేసే బుద్ధిని ప్రసాదించు
- కాంగ్రెస్ ప్రభుత్వ మోసపూరిత పాలనపై ఉమ్మడి జిల్లాలో నిరసనలు
- బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ విగ్రహాలకు వినతులు
- చేతగాని హామీలు ఎందుకివ్వాలని ప్రశ్నించిన బీఆర్ఎస్ నేతలు



సరూర్‌నగర్ డివిజన్‌లో మహాత్మాగాంధీ విగ్రహానికి వినతిపత్రం సమర్పిస్తున్న మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్ : శేరిగూడలో గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి



వికారాబాద్ పట్టణంలో ఉన్న గాంధీ విగ్రహానికి వినతిపత్రాన్ని అందజేస్తున్న బీఆర్ఎస్ పార్టీ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్

పరిగి : గాంధీ విగ్రహానికి వినతిపత్రం సమర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 420 రోజులైనా ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడంతో బీఆర్ఎస్ రాష్ట్ర పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు గురువారం ఉమ్మడి రంగారెడ్డి జిల్లావ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణులు మహాత్మాగాంధీ విగ్రహాలకు వినతిపత్రాలు సమర్పించి నిరసన తెలిపాయి. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలోని శేరిగూడలో గాంధీ విగ్రహానికి బీఆర్ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, వికారాబాద్ పట్టణంలోని గాంధీ పార్కులో ఉన్న జాతిపిత విగ్రహానికి బీఆర్ఎస్ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆనంద్, సరూర్‌నగర్ డివిజన్‌లో మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి, పరిగిలో మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి మహాత్ముడి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలు మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ నాయకులు 420 హామీలు ఇచ్చి గద్దెనెక్కారని, ఆ తర్వాత కనీసం నాలుగు హామీలను కూడా సక్రమంగా నెరవేర్చలేకపోయారని ఎద్దేవా చేశారు. హే మహాత్మా.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 420 రోజులైనా ప్రజలకు ఇచ్చిన 420 హామీలను అమలు చేయడంలో విఫలమైందని..సర్కారు కండ్లు తెరిపించి వాటిలో కొన్నింటినైనా అమలు చేసేందుకు బుద్ధిని ప్రసాదించడంతోపాటు ప్రజలకు సేవ చేసేలా చూడు అని వేడుకున్నారు. రైతుభరోసా పథకాన్ని కేవలం ఒక్కో గ్రామానికే పరిమితం చేసి చేతులు దులుపుకొన్నారని..ప్రజాపాలన, గ్రామ, వార్డు సభల్లో కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులు తీసుకొని వాటిని అర్హులకు కాకుండా అనర్హులకు ఇచ్చారని మండిపడ్డారు. గూడులేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు ఇస్తున్నామని సీఎం, మంత్రులు పదే పదే వేదికలపై ప్రకటించినా.. ఆ పార్టీ అనుకూల వ్యక్తులకే వర్తించేలా జాబితాలు రూపొందించి గ్రామసభల్లో చదివి వినిపించారని, ఇది ఎంతవరకు సబబు అని వారు ప్రశ్నించారు. ఆయా పథకాలను అర్హులకు వర్తింపజేయాలని వివిధ రూపాల్లో ఆందోళనలు చేస్తున్నా వాటిని ఎప్పుడు ఇస్తారో చెప్పలేకపోతున్నారని, చేతగాని హామీలు ఎందుకు ఇచ్చారని వారు ప్రశ్నించారు.

– న్యూస్‌నెట్‌వర్క్, నమస్తే తెలంగాణ